



ప్రజాకోర్టులో గెలిచాం: సీఎం



మీడియాతో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజాకోర్టులో గెలిచామని సీఎం సిద్దరామయ్య సంతోషం వ్యక్తం చేశారు. మూడు స్థానాల్లో మా అభ్యర్థులకు ప్రజలు ఆశీస్సులు అందించారని వారికి ధన్యవాదాలన్నారు. విజయానికి కార్యకర్తల కృషి, నాయకుల కష్టం ఉందన్నారు. బెంగళూరులో శనివారం మీడియాతో మాట్లాడారు. మా ప్రభుత్వ సాధనలను ప్రజలు విశ్వసించారన్నారు. కాంగ్రెస్ పార్టీ వాస్తవాలను ప్రజలు గమనించారన్నారు. బీజేపీ-జేడీఎస్‌లు నిరంతరం తప్పుడు ప్రచారం చేసినా వారి పట్ల కనీస సానుభూతి చూపలేదన్నారు. మా ప్రభుత్వంతోపాటు నన్ను విమర్శలు చేసే పార్టీకి తగిన గుణపాఠం లభించిందన్నారు. ఏడాదిన్నర క్రిందట 135 స్థానాల్లో గెలుపొందామని ప్రస్తుతం మూడింటితో 138కి చేరిందన్నారు. శిగ్గావిలో ముస్లిం అభ్యర్థికి టిక్కెట్ ఇచ్చినప్పుడు వ్యతిరేకత వచ్చిందని అనంతరం అక్కడివారంతా కలసి పనిచేశారన్నారు. బీజేపీ మతతత్వపార్టీకి మద్దతు ఇవ్వరాదని తీర్మానించారన్నారు. చన్నపట్టణలో కుమార స్వామి, దేవేగౌడలు చేసిన ప్రచారంను ప్రజలు నమ్మలేదన్నారు. దేవేగౌడతో ఎన్నో ఏళ్లు కలసి ఉన్నానని అయినా నాపట్ల తీవ్రమైన ఆరోపణలు చేశారన్నారు. నా గురి సిద్దరామయ్య అంటూ అహంకారంతో మాట్లాడారన్నారు. 40ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, రెండుసార్లు సీఎంగా, డీసీఎంగా మంత్రిగా నేనెప్పుడూ అలా మట్లాడలేదన్నారు. ఎన్నికలలో కుటుంబమంతా ఏడ్చారని అయినా ప్రజలు మాకే ఓటు వేశారన్నారు.

ప్రియాంకగాంధీకి శుభాకాంక్షలు

కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో ప్రియాంకగాంధీ భారీ మెజారిటీతో గెలుపు సాధించడంపై సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. ప్రియాంకగాంధీకి ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు. కేరళ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఝార్ఖండ్‌లో సీఎం సోరన్‌ను ఈడీ జైలుకు పంపడం, తప్పుడు కేసులో వేధించారనేది ప్రజలు గుర్తించారన్నారు.

రాష్ట్రమంతటా సంబరాలు

కాంగ్రెస్ పార్టీ విజయంతో రాష్ట్రమంతటా సంబరాలు చేసుకున్నారు. కేపీసీసీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి నేతృత్వంలో కేపీసీసీ కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. వేడుకలు, ర్యాలీలు నిర్వహించారు.

ఉపపోరులో కాంగ్రెస్‌దే హవా..!



కేపీసీసీ కార్యాలయం వద్ద సంబరాల్లో మహిళా అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి, కాంగ్రెస్ నేతలు

- మూడు స్థానాల్లో హస్తానిదే విజయం
- చన్నపట్టణలో సీపీ యోగేశ్వర్‌కు మలుపు
- శిగ్గావిలో పంతం నెగ్గించుకున్న యాసిర్
- కంచుకోట సండూరులో మరోసారి గెలుపు

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ హవా కొనసాగింది. మూడు శాసనసభ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అన్ని చోట్ల కాంగ్రెస్ విజయ డంకా మోగించింది. రామనగర జిల్లా చన్నపట్టణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సీపీ యోగేశ్వర్, హావేరి జిల్లా శిగ్గావి నుంచి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్, బళ్ళారి జిల్లా సండూరులో అన్నపూర్ణ గెలుపు సాధించారు. చన్నపట్టణ ఉప ఎన్నిక లో మరో రికార్డు నిలిచింది. ఇదే స్థానం నుంచి కుమారస్వామి చేతిలో వరుసగా రెండుసార్లు ఓటమి చెందిన సీపీ యోగేశ్వర్ హ్యాట్రిక్ నుంచి తప్పించుకున్నారు. ఎంపీ ఎన్నికల్లోనూ, రామనగర నుంచి శాసనసభ ఎన్నికల్లో ఓడిన నిఖిల్ ఉప ఎన్నికల్లో ఓటమిలోనూ హ్యాట్రిక్ అయ్యారు.

భారీ మెజారిటీ సాధించిన సీపీ యోగేశ్వర్

చన్నపట్టణ నుంచి గెలుపొందిన సీపీ యోగేశ్వర్ సమీప అభ్యర్థి ప్రత్యర్థి నిఖిల్‌పై భారీ మెజారిటీతో గెలుపు సాధించారు. సీపీ యోగేశ్వర్‌కు 1,12,642 ఓట్లు రాగా, నిఖిల్‌కు 87,229 ఓట్లు సాధ్యమయ్యాయి. 25,413 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక్కడి నుంచి అత్యధికంగా 32మంది బరిలో ఉన్నారు. వీరిలో ఇండిపెండెంట్‌లు నాగరాజ్‌కు 2,352, జేపీ ప్రకాశ్‌కు 1649 ఓట్లు రాగా ఎస్‌డీపీఐ నుంచి పోటీ చేసి మహ్మద్ ఫాజిల్‌కు 957 ఓట్లు రాగా మిగిలిన ఎవరికీ 500 ఓట్లు దాటలేదు. 20 లోపు ఓట్లు వచ్చిన వారు ఏడుగురికి కనీసం 20ఓట్లు కూడా దక్కలేదు.

విజయంతో మలుపు

మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా అందరి దృష్టి చన్నపట్టణపైనే కొనసాగింది. నామినేషన్ల దాఖలుకు రెండు రోజుల ముందు దాకా బీజేపీ ఎమ్మెల్సీగా కొనసాగిన సీపీ యోగేశ్వర్ టిక్కెట్‌ను ఆశించారు. అయితే ఇదే నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలంగా రాజకీయాలు కొనసాగించిన కుమారస్వామి సీటును వదులుకునేందుకు ఆసక్తి చూపలేదు. యోగేశ్వర్‌కు జేడీఎస్ నుంచి పోటీ చేసేలాంటి ఆఫర్ కూడా ఇచ్చారు. అయితే పోటీ చేస్తే బీజేపీ నుంచి లేదంటే నా దారి చూసుకుంటానని యోగేశ్వర్ తేల్చి చెప్పారు. కుమారస్వామి పట్టు వీడకపోవడం, పైగా బీజేపీ అగ్రనేత యడియూరప్ప చన్నపట్టణ జేడీఎస్‌కు చెందిన సీట్ అని వారి ఇష్టమంటూ స్పష్టం చేయడం బీజేపీలో గందరగోళమైంది. ఇదే కారణమే సీపీ యోగేశ్వర్ పార్టీని వీడేందుకు దోహదపడింది.



యోగేశ్వర్‌తో మాజీ ఎంపీ డీకే సురేశ్

పంతం నెగ్గించుకున్న డీకే



రామనగర జిల్లాలో ప్రాబల్యం కోసం మూడు దశాబ్దాలుగా డీకే శివకుమార్, కుమారస్వామి పోటీ పడుతూ వచ్చారు. గతంలో దేవెగౌడను ఇదే ప్రాంతంనుంచి ఎంపీగా ఓడించడంలోనూ కుమారస్వామి కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఇలా సాగుతుండగా 2018 ఎన్నికల తర్వాత సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుతో ఇద్దరూ సన్నిహితులయ్యారు. అయితే ఇది సుదీర్ఘకాలం కొనసాగలేదు. 2023 శాసనసభ ఎన్నికల వేళ నిఖిల్ రామనగరలో ఓడించేందుకు డీకే శివకుమార్, డీకే సురేశ్‌లు కీలకులయ్యారు. ఆ తర్వాత శివకుమార్ సోదరుడు రెండుసార్లు బెంగళూరు గ్రామీణ నుంచి ఎంపీగా గెలుపొందిన డీకే సురేశ్‌ను ఓడించేందుకు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కుమారస్వామి సవాల్‌గా తీసుకున్నారు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని జయదేవ ఆసుపత్రుల మాజీ డైరెక్టర్, బావ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బెంగళూరు గ్రామీణ నుంచి పోటీ చేయించి భారీ మెజారిటీతో గెలుపునకు కారకులయ్యారు. చన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగిన కుమారస్వామి మండ్య ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రి కావడంతో ఉప ఎన్నికల్లో చన్నపట్టణను దక్కించుకోవాలని డీకే శివకుమార్ అలుపెరగని పోరాటం చేశారు. ఎన్నోసార్లు నేనే చన్నపట్టణ అభ్యర్థి అంటూ బహిరంగంగా ప్రకటించుకున్నారు. చివరిక్షణంలో తమ్ముడు సురేశ్‌ను పోటీ చేయించాలని ప్రయత్నించారు. అయితే సీపీ యోగేశ్వర్ పార్టీలోకి రావడంతో ఆయనను అభ్యర్థిని చేశారు. ఇప్పటికే ఇదే నియోజకవర్గం నుంచి పలుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా వ్యవహరించిన సీపీ యోగేశ్వర్ ద్వారా పంతాన్ని నెగ్గించుకునేందుకు డీకే శివకుమార్ క్రియాశీలకంగా వ్యవహరించారు. నామినేషన్ల నుంచి డీకే సురేశ్ చన్నపట్టణలో మకాం వేశారు. ఏకంగా 13మంది జేడీఎస్ కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడం ద్వారా చన్నపట్టణ పురపాలకను సొంతం చేసుకున్నారు. గ్రామస్థాయి నాయకులు, సర్పంచ్‌లు వార్డు మెంబర్‌లు, తాలూకా పంచాయతీ సభ్యులను పార్టీలోకి చేర్చుకున్నారు. ఇలా అన్ని రకాల బలం పెంచుకుని ఇతరత్రా వ్యవహారాలలోనూ క్రియాశీలకంగా పనిచేశారు. ఒకేదెబ్బకు రెండు పిట్టల్లా కుమారస్వామిపై కక్ష తీర్చుకున్నారు. చన్నపట్టణలో నిఖిల్ ఓటమి ద్వారా రామనగర జిల్లాలో జేడీఎస్ ప్రాబల్యం నిర్వీర్యం చేశారు. జేడీఎస్‌కు బలమున్న హాసన్‌లోనూ ఇప్పటికే కాంగ్రెస్ బలం పెంచుకుంది. రామనగరలోనూ సత్తా చాటడంతో జేడీఎస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది.

కంచుకోట సండూరు కాంగ్రెస్ కైవసం

బళ్లారి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠగా సాగిన ఉపపోరులో సండూరులో కాంగ్రెస్ విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి ఇ. అన్నపూర్ణ సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత పై 9,649 ఓట్ల ఆదిక్యతతో విజయం సాధించినట్లు కేంద్ర ఎన్నికల అధికారి రాజేష్ ప్రకటించారు. శనివారం బళ్లారిలోని పాలిటెక్నికల్ కళాశాలలో ఉప ఎన్నికల ఓట్లు లెక్కింపు చేపట్టారు. సండూరులో ఆరుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇ. అన్నపూర్ణకు 93,606 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత కు 83,961 ఓట్లు పడ్డాయి.



డిక్లరేషన్ అందుకుంటున్న అన్నపూర్ణ, పక్కన ఎంపీ తుకారాం

శిగ్గావిలో పఠాన్ యాసిర్ అహ్మద్ ఖాన్‌దే విజయం

హావేరి జిల్లా శిగ్గావిలో గత ఎన్నికల్లో ఓటమి చెందిన పఠాన్ యాసిర్ అహ్మద్‌ఖాన్ వ్యూహాత్మకంగా గెలుపు సాధించారు. యాసిర్‌కు 1,00,756 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి భరత్ బొమ్మైకు 87,308 ఓట్లు దక్కాయి. యాసిర్ 13,448 ఓట్ల తేడాతో గెలుపు సాధించారు. కర్ణాటక రాష్ట్ర సమితి నుంచి పోటీ చేసిన రవికృష్ణారెడ్డికి 1876 ఓట్లు సాధించారు. మరో ఐదుగురు అభ్యర్థులకు వెయ్యి లోపు ఓట్లు మాత్రమే దక్కాయి.

బొమ్మైకు షాక్

హావేరి జిల్లా శిగ్గావిలో ఓటమి ఎరుగని బసవరాజ్ బొమ్మై కుటుంబానికి షాక్ తగిలింది. కాంగ్రెస్ నుంచి గత ఎన్నికల్లో ఓటమి చెందిన యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్ అనూహ్యంగా భారీ మెజారిటీతో గెలుపొందారు. శిగ్గావికి కాంగ్రెస్ సీనియర్ నేత సతీశ్‌జార్కిహొళితోపాటు లక్ష్మీ హెబ్బాళ్కర్ తదితరులు ఇన్‌చార్జ్‌లుగా నియమించడంతో వారు క్రియాశీలకంగా వ్యవహరించారు. ఉత్తర కర్ణాటకవైపు జిల్లాల మంత్రులు అక్కడే మకాం వేసి మరీ విజయం కోసం ప్రయత్నించారు. రాజకీయాలకు కొత్త అయిన భరత్‌బొమ్మైను తొలిసారే అభ్యర్థిని చేశారు. భరత్‌బొమ్మైకు టిక్కెట్ ఇప్పించడంపై సొంతపార్టీలోనూ విమర్శలు వినిపించాయి. వారసులకు టిక్కెట్‌లు ఇచ్చుకుంటే జీవితకాలం మేం సామాన్య కార్యకర్తలా కొనసాగాలా...? అంటూ పలువురు అభ్యంతరం తెలిపారు. కానీ యాసిర్‌కు గతంలో ఓటమితో సానుభూతి కూడా కలసి వచ్చింది. పైగా స్థానికులలో వారసత్వంపై వ్యతిరేకత భరత్‌బొమ్మైకు షాక్ ఇచ్చింది.



మీడియాతో పఠాన్ యాసిర్ అహ్మద్‌ఖాన్

హ్యాట్రిక్ ఓటమి

- నిఖిల్ పరాజయంతో జేడీఎస్‌లో కలకలం
- 90 ఏళ్ల వయసులోనూ దేవెగౌడ ప్రచారం
- కుమారస్వామికీ కోలుకోలేని దెబ్బ



మీడియాతో మాట్లాడుతున్న నిఖిల్

బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలను బాగానే వేడెక్కించినా జేడీఎస్ పార్టీకి మాత్రం కోలుకోలేని దెబ్బ తీశాయి. చన్నపట్టణ స్థానం వదులుకునేందుకు సుముఖత చూపని కుమారస్వామి మరో చారిత్రాత్మక తప్పిదం చేసినట్లయ్యింది. ఇటీవల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యేదాకా అభ్యర్థి తానుకాదంటూ చెప్పుకొన్న వారసుడు నిఖిల్‌ను ఒప్పించి బరిలోకి దించారు. మండ్య నుంచి లోక్‌సభ ఎన్నికల్లో, రామనగర నుంచి శాసనసభ ఎన్నికల్లో ఓటమి చెందిన నిఖిల్ మరో ప్రయోగానికి హ్యాట్రిక్ స్థానంలో బలయ్యారు. నిఖిల్ అభ్యర్థి అయ్యాక వారి కుటుంబమంతా కలసికట్టుగా చన్నపట్టణలోనే మకాం వేశారు. 90ఏళ్లు దాటి ఇటీవల కొంతకాలంగా వయోభారం, అనారోగ్య సమస్యలతో కేవలం ఇంటి పట్టుకే పరిమితమైన మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ సైతం మనవడు నిఖిల్ కోసం నడుం బిగించారు. కొన్ని రోజులపాటు చన్నపట్టణలో తిరిగి 22 సభల్లో ప్రచారం చేశారు. అయినా ఫలితం దక్కలేదు. కేంద్రమంత్రి కుమారస్వామి 20 రోజులుగా చన్నపట్టణను వీడి ఎటువైపు వెళ్లలేదు. కేవలం చన్నపట్టణలోనే తిరుగుతూ ప్రచారం చేశారు. నిఖిల్ తల్లి అనితా కుమారస్వామి నిరంతర ప్రచారం చేశారు. రాజకీయాల్లో తొలిసారిగా నిఖిల్ భార్య రేవతి కూడా ప్రచారంలో పాల్గొన్నారు. అయినా చిత్తుగా ఓడిపోయారు. నిఖిల్ ఓటమిపై వరుస ట్రోల్‌లు హల్‌చల్ చేశాయి. గతంలో నిఖిల్ ఎక్కడున్నావు అంటూ కుమారస్వామి చేసిన వ్యాఖ్యలను తిరిగి వైరల్ అయ్యాయి. ఇక సినిమాలు చేసుకో రాజకీయాలు ఎందుకంటూ నెటిజన్‌లు కామెంట్ చేశారు.

పోరాటం చేస్తా: నిఖిల్

ఎన్నికల్లో ఓడినంత మాత్రాన వెనుకడుగు వేసేది లేదని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తానని నిఖిల్ తెలిపారు. ఫలితాలు వెలువడిన తర్వాత బిడదిలో మీడియాతో మాట్లాడారు. తనకు 87వేలమంది మద్దతు ఇచ్చి ఓటు వేశారని వారందరికీ ధన్యవాదాలన్నారు. రామనగర జిల్లాలో ఓ ధ్వనిలా కార్యకర్తలు పనిచేశారన్నారు. దేవెగౌడ, కుమారస్వామి జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలను తాను మరువనన్నారు. రామనగరలో జన్మించికపోయినా ఈ ప్రాంతంతో నాకు భావనాత్మక సంబంధం ఉందన్నారు. తండ్రి కుమారస్వామితో కలసి జిల్లా అభివృద్ధికోసం పాటుపడతానన్నారు. రాజకీయాల్లో గెలు పోటములు సహజమన్నారు.

ఓటమి నిరాశ కలిగించింది : విజయేంద్ర



బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉప ఎన్నికల్లో మూడు చోట్ల ఓటమి నిరాశ మిగిల్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర విచారం వ్యక్తం చేశారు. ఫలితాల తర్వాత శనివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ చన్నపట్టణలో గెలుస్తామని భావించామన్నారు. కానీ ఓటమి చవిచూశామన్నారు. సండూరులో 83వేల ఓట్లు వచ్చాయని, కానీ ఎదురుదెబ్బ తగిలిందన్నారు. శిగ్గావిలోనూ ఇదే పరిస్థితి కొనసాగిందని ఓటమిపై సీనియర్లతో కలసి ఆత్మావలోకనం చేసుకుంటామన్నారు. మహారాష్ట్రలో చారిత్రాత్మకమైన విజయం హర్షణీయమన్నారు. 288 స్థానాలకు ఏకంగా 230 స్థానాల్లో గెలుపొందడం రికార్డు సాధ్యమయ్యిందన్నారు. రాష్ట్రంలో పార్టీ అపజయంపై చర్చిస్తామన్నారు.

సద్వినియోగం కాని గ్రాంట్లు..

- దశాబ్దాలుగా పెండింగ్‌లోనే కళాశాలల నిధులు



బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావిభాగంలో అభివృద్ధి సాధించాలనే దిశగా ప్రాంతాలవారీగా డిగ్రీ కళాశాలలకు అదనపు తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతరత్రా మౌలిక సదుపాయాల నిర్మాణాలకు విడుదల చేసిన కోట్లాది రూపాయల గ్రాంట్లు సద్వినియోగం కాలేదు. సాధారణంగా ప్రభుత్వం నుంచి అనుమతులు దక్కితే చాలు వివిధశాఖల్లో పనులు చురుగ్గా పూర్తి చేస్తారు. ఆ తర్వాత బిల్లులకోసం ఏడాది రెండేళ్లు ఎదురుచూసే పరిస్థితి ఉంటుంది. కానీ ఉన్నతవిద్యాశాఖలో ఇందుకు భిన్నంగా మంజూరైన గ్రాంట్లను సద్వినియోగం చేసుకోకుండా వదిలిపెట్టారు. ఇలా ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే గ్రాంట్లను వృథా చేయరాదని భావించిన ఉన్నత విద్యాశాఖ మంత్రి సొంత జిల్లాకు సులభతరంగా మళ్లించారు. ఈ అంశం వెలుగులోకి రావడంతో గ్రాంట్లు మంజూరై పనులు చేపట్టకుండా పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల కళాశాలల విద్యార్థులు, పూర్వ విద్యార్థుల అధికారుల తీరును తప్పుబడుతున్నారు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 9 డిగ్రీ కళాశాలలకు భవన నిర్మాణాలకోసం 2012-13 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం దాకా 8.82 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. నిర్మాణ పనులను కర్ణాటక గృహమండలికి కేటాయించారు. అయితే 7.87 కోట్ల రూపాయల మొత్తం 8 పనులు అమలుకు నోచుకోలేదు. రూ.1.95 కోట్ల విలువైన రెండు నిర్మాణ పనులను రైట్స్ సంస్థకు కేటాయించారు. ఇది కూడా కొన్ని కారణాలతో అమలు కాలేదు. దీంతో ఇప్పటివరకు గ్రాంట్లు మంజూరై నిర్మాణాలకు నోచుకోని పది పనులను అత్యంత అవసరంగా భావించిన మూడు కళాశాలలకు మళ్లించారు. 2012-13లో బెంగళూరు నగరం కాడుగూడి డిగ్రీ కళాశాలకు, చామరాజనగర జిల్లా యళందూరు కళాశాలకు, 2014-15లో కొప్పళ డిగ్రీ కళాశాలకు, 2015-16లో మైసూరు మహారాణి సైన్స్ కాలేజ్, మైసూరు విజయనగర డిగ్రీ కళాశాల, మైసూరు కువెంపునగర డిగ్రీ కళాశాలకు, 2018-19లో శివమొగ్గ జిల్లా భద్రావతి కళాశాలకు శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళి డిగ్రీ కళాశాలకు గ్రాంట్లు కేటాయించారు. 2020-21లో మండ్య డిగ్రీ కళాశాలకు గ్రాంట్లు కేటాయించారు. మైసూరులోని మూడు కళాశాలలకు గ్రాంట్లు కేటాయించినప్పుడు సీఎంగా అప్పట్లో సిద్దరామయ్య ఉండేవారు. సొంత జిల్లాకు ముఖ్యమంత్రి కేటాయించిన నిధులను సైతం ఖర్చు చేయలేకపోయారు. 2018-19లో శివమొగ్గ జిల్లాకు రెండు కళాశాలలకు గ్రాంట్లు కేటాయించినప్పుడు సీఎంగా యడియూరప్ప ఉన్నారు. ఆయన విడుదల చేసిన నిధులు కూడా ఖర్చు చేయలేదు. దాదాపు దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లను ఉమ్మడి కోలారు జిల్లాకు ఇటీవల మళ్లించారు. ఇందులో చింతామణి కళాశాలకు రూ.5కోట్లు, కోలారు కళాశాలకు రూ.2కోట్లు, కోలారులోని ప్రభుత్వ లా కళాశాలకు రూ.1.82 కోట్లు పంపిణీ చేశారు. ఖర్చు కాలేని గ్రాంట్లు మళ్లించడం ఎలా ఉన్నా, సదరు పనులు కర్ణాటక గృహ మండలి ద్వారానే నిర్వహించాల్సి ఉంది. మళ్లీ జాప్యం చేస్తే పూర్తిగా అన్యాయం అవుతుందని గడువులోగా పనులు ముగించేలా ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

గ్రాంట్లు వినియోగించుకోవడం తప్పు కాదు

కొన్నేళ్లకాలంగా సద్వినియోగం కాని గ్రాంట్ల ద్వారా కళాశాల భవనాల నిర్మాణానికి ఉపయోగించడం తప్పు కాదని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలతోపాటు ఇతరత్రా సౌలభ్యాలు పెంచే విషయంలో కట్టుబడ్డామన్నారు.

యాంటీబయాటిక్స్‌తో అనర్థాలు

యాంటి బయాటిక్ మందులు మోతాదుకు మించి వాడరాదని, నియంత్రణకు ప్రత్యేక పాలసీ అవసరమని ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. జాతీయస్థాయి ఫీవర్‌కాన్ సమ్మేళనాన్ని నగరంలో ఆయన ప్రారంభించారు.

7



సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న ఎండీ డాక్టర్ మంజునాథ్

ఓటమిని జీర్ణించుకోలేక టీవీ ధ్వంసం..



టీవీని ధ్వంసం చేస్తున్న భాగి

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల ఓటమిని తట్టుకోలేక ఓ కార్యకర్త టీవీని పగలకొట్టాడు. విజయపుర జిల్లా కొల్హార పట్టణానికి చెందిన వీరభద్రప్ప భాగి అనే కార్యకర్త శనివారం ఫలితాలు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో నుంచి టీవీని రోడ్డుపై వేసి పగులగొట్టారు. ఫలితాలపై ఆయన మండిపడ్డారు. కార్యకర్తలను నాయకులే దారి తప్పిస్తున్నారన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు పెరిగిపోయాయని ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని కోరారు.

విహంగ విహారం..!

బళ్లారి సిటీ,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్ళి తాలూకా అంకసముద్రం పక్షుల సంరక్షణ కేంద్రానికి యూరప్ నుంచి వచ్చిన వలస పక్షులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. రోజీస్టారింగ్, వైట్ బ్రౌడ్ డక్, వుడ్ సండ్‌పైపర్, ఎల్లో వాగ్‌టైల్, వైట్ వాగ్‌టైల్ వంటి పలు జాతుల పక్షులు విహారినికి విచ్చేశాయి. ఏటా నవంబర్‌లో పక్షలు విహారానికి వస్తాయని కేంద్రం అధికారులు తెలిపారు.



గార్గేని పక్షి

అంక సముద్రం పక్షుల అభయారణ్యం





వుడ్ సాండ్ పైపర్ పక్షి



ప్రపంచ శాంతి వేదిక.. ప్రశాంతినిలయం

సత్యసాయిబాబా మహాసమాధి



- సత్యసాయి సేవలు ప్రపంచానికే ఆదర్శం
- గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఘనంగా సత్యసాయి జయంతి
- పాల్గొన్న దేశ, విదేశాల భక్తులు

పుట్టపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి అవతరించిన ప్రశాంతినిలయం ప్రపంచశాంతికి వేదికగా మారిందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ పేర్కొన్నారు. సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు శనివారం ప్రశాంతినిలయంలోని సాయికుల్వంతులో కన్నుల పండువగా జరిగాయి. విద్యార్థుల గురువందనం భక్తిగీతాల ఆలపనతో జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రసంగిస్తూ సత్యసాయి తన ఆధ్యాత్మిక బోధనలు, సేవలు, ప్రేమతత్వంతో కోట్లాది మందికి ఆరాధ్యదైవమయ్యారని కొనియాడారు. సత్యసాయి అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీరు వంటి సేవలు వెలకట్టలేనివన్నారు. వేలాది గ్రామాలకు స్వచ్ఛమైన



ఉత్సవాలకు హాజరైన భక్తులు



మహాసమాధిని దర్శించుకుంటున్న గవర్నర్



సత్యసాయి బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

తాగునీరు అందించడానికి సత్యసాయి వందల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడానికి సత్యసాయి సేవా సంస్థలు ఎప్పుడు ముందుంటాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులకు రాగి మాల్ట్ అందిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం గవర్నర్ చేతులమీదుగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ట్రస్టు ప్రతినిధులతో కలిసి ట్రస్టు వార్షిక నివేదికను విడుదల చేశారు.

సేవల ఖర్చు రూ.166 కోట్లు



సత్యసాయి బాబా చేపట్టిన సేవలను మరింత పారదర్శకంగా కొనసాగిస్తున్నామని, ఈ ఏడాది సేవల కోసం రూ.166 కోట్లు ఖర్చు చేసినట్లు ట్రస్టు సభ్యులు నాగానందం పేర్కొన్నారు. రూ.237 కోట్లు రాబడి ఉందన్నారు. వైద్యసేవలకు రూ.100 కోట్లు, క్యాపిటల్ ఖర్చు రూ.32కోట్లు, ఉచిత విద్యుత్‌కు రూ.15కోట్లు, అభివృద్ధి పనులకు రూ.20కోట్లు, ఇతర కార్యక్రమాలకు రూ.28కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. బెంగళూరు వైట్ ఫీల్డ్ ఆస్పత్రిలో 16500 ఉచిత శస్త్రచికిత్సలు, 2.30లక్షల మందికి పరీక్షలు, మొబైల్ ఆస్పత్రి ద్వారా 56వేల మందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు వివరించారు. ఇవేకాక కాకదేశ వ్యాప్తంగా సేవలను కొనసాగిస్తున్నామన్నారు.

ప్రధాని సందేశం

సత్యసాయి జయంతి వేడుకలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంపించిన సందేశాన్ని ట్రస్టు సభ్యులు నాగానందం చదివి వినిపించారు. సత్య సాయిబాబా మానవతా మూర్తి అని, ఆయన సేవలు వెలకట్టలేనివని, ము ఖ్యంగా అతిఖరీదైన ఉచిత వైద్యాన్ని అందరికి అందిస్తుండటం ప్రశంసనీయంటూ ప్రధాని సందేశాన్ని చదివి వినిపించారు. ట్రస్టు సభ్యులు గవర్నర్‌కు, మంత్రికి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి మొక్కలు పంపిణీ చేశారు.

పాల్గొన్న వీఐపీలు

సత్యసాయి జయంతి వేడుకల్లో రాష్ట్రమంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, గీతారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్‌రాజు, ట్రస్టు సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, ప్రసాద్, రామసుబ్రహ్మణ్యం, కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఎస్పీ రత్న, ఏఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ధర్మవరం ఆర్డీఓ మహేశ్, పుట్టపర్తి తహసీల్దార్ అనుపమ, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, సేవాసంస్థల ప్రతినిధులు నిమీష్‌పాండే, హీరా, కోటేశ్వరరావు, చలం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న మల్లాది సోదరులు

సత్యసాయి సేవలు 139 దేశాలకు విస్తరణ: మంత్రి



సత్యసాయిబాబా తన సేవలను 139 దేశాలకు విస్తరించారంటూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కొనియాడారు. 99 సంవత్సరాల కిందట సత్యనారాయణ అవతరించారని, ఆయనే సత్యసాయి బాబాగా తన 14వ ఏట అవతరణ ప్రకటన చేసి ఆధ్యాత్మిక బోధనల ద్వారా గురువుగా పూజలందుకుంటున్నారన్నారు. అంచెలంచెలుగా తన సేవలను ప్రపంచానికి విస్తరించారని పేర్కొన్నారు. నిస్వార్థసేవలకు సత్యసాయి ప్రతి రూపమని అందుకే నేడు ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయికి లక్షలాది భక్తులు ఉన్నారన్నారు. 2020-25 సత్యసాయి స్వర్ణోత్సవాలు నిర్వహించడానికి ముందస్తు ప్రణాళిక చేయడం అభినందనీయమన్నారు. సత్యసాయి శివైక్యం తరువాత సేవలు యథావిధిగా సాగడం అంతా ట్రస్టు కృషేనన్నారు.

కన్నుల పండువగా స్వర్ణరథోత్సవం

ప్రశాంతి నిలయం వీధుల్లో స్వర్ణ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. సాయంత్రం 5గంటలకు బంగారు రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తిపాటలు పాడుతూ రథోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి సాయికుల్వంతులో లాలంబుడి కృష్ణబృందం సత్యసాయి జోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మల్లాది సోదరులు సంగీత గానంతో భక్తులను అలరించారు. సత్యసాయి జయంతి వేడుకలలో దేశవిదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్


ఆధార్ అనుసంధానంలో ప్రథమ స్థానం

- డీపీఓ నాగరాజనాయుడు



అనంతపురం న్యూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ సహకారంతోనే పంచాయతీల్లోని ప్రజల బ్యాంకు అకౌంట్లకు ఆధార్ అనుసంధానంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. శనివారం బ్యాంకు అకౌంట్ ఆధార్ అనుసంధానంపై గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ జిల్లా పంచాయతీ అధికారులు, ఇతర అధికారులతో గుగూల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో వెనుక బడిన వారికి చురకలు అంటించారు. వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 96 శాతం పూర్తి చేసిన అనంతపురం డీపీఓ నాగరాజనాయుడుతో డైరెక్టర్ మాట్లాడారు. మిగిలిన జిల్లాల్లో ఎవరూ ఈ స్థాయిలో చేయలేక పోయారని, మీరు ఎలా చేశారని, పాటించిన అంశాలను వివరించాలని అడిగారు. దీనిపై డీపీఓ నాగరాజనాయుడు మాట్లాడుతూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలకు అనుగుణంగా సిబ్బందిని సచివాలయాల వారిగా అప్రమత్తం చేశామని తెలిపారు. సమస్యలు ఉన్న చోట తగిన సూచనలు చేశామన్నారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎంపీడీఓల ద్వారా ఎప్పటికప్పుడు ఆరా తీసి సూచనలు ఇచ్చారని తెలిపారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి : జేడీ



మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

అనంతపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీలకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో ఆయన ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీలు, యార్డుల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీల వారిగా లక్ష్యాలు..పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యార్డుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి కమిటీలోను నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి, సత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ మూర్తి, ఉమ్మడి జిల్లా పరిధిలోని స్పెషల్ గ్రేడ్ కార్యదర్శులు, యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. డిసెంబరు 14న అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మోటారు వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేస్తామని పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లాకు వచ్చేసిన ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న ఎంపీఈఓలు ఎట్టకేలకు తిరిగి జిల్లాకు వచ్చేశారు. ఉమ్మడి జిల్లాలో 105 మంది ఎంపీఈఓలు తిరిగి రావాల్సి ఉంది. అనంతపురం జిల్లాకు 52 మంది రావాల్సి ఉండగా ఇప్పటి దాకా 36 మంది ఎంపీఈఓలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. మిగిలిన సిబ్బంది చిత్తూరు జిల్లాలో నో డ్యూస్ సర్టిఫికెట్‌తోపాటు రిలీవింగ్ ఆర్డర్లు తీసుకొని మరో మూడు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

కూలీల కుటుంబాలను ఆదుకోవాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యవసాయ కూలీల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కూలీలకు ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మూడు ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు, దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుత్తిరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా స్వామికి వేకువ జామున పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించి ఆకు పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం మహిళలు ఆలయ ఆవరణంలో దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శంచుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంతరావు



అనంతపురం విద్య, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంతరావును ఎంపిక చేసినట్లు ఆ సంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమంతరావు వజ్రకరూరు మండలం పీసీపీ కొత్తకోట హైస్కూల్‌లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. మందకృష్ణ భారీ కార్యక్రమాలకు మాదిగ ఉద్యోగులను, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను చైతన్య పర్చడంలో ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు స్పష్టం చేశారు.

పదోన్నతి జేఈఈలలో... ఆందోళన..!



- పీఆర్‌లో అడహక్ ప్రమోషన్లపై ప్రభుత్వం ఆరా
- హైకోర్టు తీర్పు అమలుకు ఉన్నతాధికారుల కసరత్తు

అనంతపురం సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో సీనియారిటీని పక్కనపెట్టి గత సర్కార్ ఇచ్చిన జీఓ-71 ఆధారంగా ఇటీవల చేపట్టిన ఏఈఈలకు పదోన్నతులు కల్పించడంపై తప్పుపడుతూ.. సదరు జీఓను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆ పదోన్నతులు రద్దయ్యాయి. సీనియారిటి ప్రకారం పదోన్నతులు కల్పించాలని హైకోర్టు ఆదేశించడంతో నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలకు ఊరట కలిగింది. పీఆర్‌శాఖలో జరిగిన అడహక్ ప్రమోషన్లతో పాటు హైకోర్టు తీర్పు.. తదితర విషయాలపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో ఆ శాఖ ఉన్నతాధికారులు హైకోర్టు తీర్పుకు అనుగుణంగా తప్పులను సవరించుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అడహక్ ప్రమోషన్లు పొందిన వారితో పాటు నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలు, ఎఫ్‌ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న ఏఈఈలలోను ఉత్కంఠ నెలకొంది.

- ఈఎన్‌సీని కలిసేందుకు సన్నాహాలు

హైకోర్టు తీర్పుతో నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలలో ఉత్సాహం నెలకొంది. ఎన్నో ఏళ్ల నుంచి పోరాడి సాధించుకున్న కల తాజా తీర్పుతో నెరవేరిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని జోన్-1, జోన్-2, జోన్-3, జోన్-4 పరిధిలో పనిచేస్తున్న నాన్ ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలందరూ కలిసి త్వరలోనే ఆ శాఖ ఈఎన్‌సీని కలిసి వెంటనే హైకోర్టు తీర్పును అమలు చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

హైకోర్టు తీర్పు అమలుకు కసరత్తు

ఎన్నో ఏళ్ల నుంచి ఏపీపీఎస్సీ, నాన్ ఏపీపీఎస్సీ బ్యాచ్‌ల మధ్య నెలకొన్న పదోన్నతుల ప్రక్రియ వ్యవహారంలో తాజాగా హైకోర్టు తీర్పుతో కొంత కొలిక్కి వచ్చినట్లయింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం విమర్శలకు తావులేకుండా జాగ్రత్త పడుతున్నారనే తెలుస్తోంది. గత సర్కార్ ఇచ్చిన జీఓను హైకోర్టు కొట్టివేయడంతో ఇటీవల 1997 ఏపీపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన అడహక్ పదోన్నతులను రద్దు చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించే దిశగా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అడహక్ పదోన్నతులు పొందిన వారికేనా..? గతంలో ఎఫ్‌ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న వారికి కూడా ఇదే షరతు వర్తించేలా చేశారా.? అనే సందేహాలు మాత్రం లేకపోలేదు. గత సర్కార్ ఇచ్చిన జీఓ-71తో ఇటీవల అడహక్ పదోన్నతులు పొందిన 1997 ఏపీపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన ఏఈఈలలో హైకోర్టు తీర్పుతో ఆందోళన మొదలైంది. అధికార లెక్కల ప్రకారం జోన్-1,-2,-3,4 పరిధిలో మొత్తంగా 50 మంది ఏఈఈలు అడహక్ పదోన్నతులు పొందినట్లు తెలిసింది.



పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం

- ఎఫ్‌ఏసీ, ఓడీలో పనిచేస్తున్న వారిలో ఉత్కంఠ

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతి రావాలన్నా.. ఎఫ్‌ఏసీ, ఓడీలపై పోస్టింగులు పొందాలన్నా చాలా కష్టమైన పని. ఈ నేపథ్యంలో అడహక్ పదోన్నతులు తెచ్చిన తంటాతో అసలుకే ఎసరు వచ్చింది. ప్రమోషన్లు ఇవ్వకపోయినా ఏదో ఒకరకంగా ఎఫ్‌ఏసీ, ఓడీల రూపంలో పనిచేసుకునే వాళ్లం అనే అభిప్రాయం నెలకొంది. అడహక్ పదోన్నతులు ఇవ్వడం.. హైకోర్టు సదరు జీఓను కొట్టివేయడంతో తమకు పెద్ద సమస్య వచ్చి పడిందని ఎఫ్‌ఏసీ, ఓడీల రూపంలో పనిచేసే ఏఈఈలో ఆందోళన నెలకొంది. హైకోర్టు తీర్పుతో అడహక్ ప్రమోషన్లను మాత్రమే రద్దు చేస్తారా..? లేక.. ఎఫ్‌ఏసీ, ఓడీలను కూడా రద్దు చేస్తారా..? అని సదరు వర్గాల్లో ఉత్కంఠ మొదలైంది.

ఫైలు కదలాలంటే.. పైసలివ్వాల్సిందే..!

- ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో వింత పరిస్థితి
- వీఆర్‌ఓ లంచం డిమాండ్‌పై సోషల్‌మీడియాలో వైరల్
- గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ధర్మవరంరూరల్, నవం బరు 23(ఆంధ్రజ్యోతి): స్థాని క తహసీల్దార్ కార్యాలయం లో చేయి తడపనిదే ఏ ఫైలు ముందుకు కదలదని బాధి తులు చెబుతున్నారు. పైసలు ఇవ్వకుంటే నెలల తరబడి తిరిగినా పని కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం లంచాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంత డబ్బు ఇవ్వలేం

మండలంలోని పోతుకుంట గ్రామంలో సర్వేనెంబర్ 695-1లో తమ భూమి రికార్డు పత్రాలను, అందుకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని రైతు శ్రీలత గత రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి మూడు లక్షలు డబ్బులు ఇవ్వాలని అదేకార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్‌తో డీల్ చేయాలని ఆదేశించాడు. అయితే అంతడబ్బు ఇవ్వలేమని వారు తేల్చిచెప్పారు.

- నాగార్జున అనే వ్యక్తి గరుడంపల్లి గ్రామంలో భూమి కొనుగోలు చేశాడు. ఆభూమికి సంబంధించి రికార్డులు తమ పేరుపై ఉన్నాయని, రిజిస్టర్ కూడా చేసుకున్నామన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది ఆ భూమిలో దొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తారని తెలియడంతో రెండు రోజుల కిందట నాగార్జున తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. తమ భూమికి పొజిషన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తారని, అడిగినంత డబ్బులు ఇస్తే చేస్తావా? లేకుంటే చేయవా అంటూ బూతులతో రెచ్చిపోయారు. వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి కూడా బాధితుడిపై అదేస్థాయిలో రెచ్చిపోయారు. అప్పుడే పోతుకుంటకు చెందిన బాధితురాలు శ్రీలత కూడా అక్కడకు వచ్చి తమ రికార్డుల కోసం రూ. మూడు లక్షలు లంచం డిమాండ్ చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలను అక్కడే ఉన్న కొంతమంది వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.
- కుణుతూరు పంచాయతీలో అసైన్‌మెంట్ భూములను గత ప్రభుత్వంలో కొంతమంది వైసీపీ నాయకులు అవకతవకలు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో 1బీ రాకుండా డిజిటల్ కీ పెండింగ్ పెట్టారు. అయితే ఈ భూములపై వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి వారితో మాట్లాడి డబ్బులు వసులు చేసి డిజిటల్ కీ ఇప్పించారని అప్పట్లో కొంతమంది కార్యాలయానికి వచ్చి వాగ్వాదానికి దిగారు.

సీరియస్‌గా పరిగణించిన జిల్లా ఉన్నతాధికారులు

వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి మూడు లక్షలు డిమాండ్ చేశాడని బాధితురాలు శ్రీలత చెప్పిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే విచారణకు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన నివేదికను విచారణ చేసి పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు బాధితులను విచారించారు. తమను లంచం అడిగిన విషయం వాస్తవేమని పలువురు బాధితులు తహసీల్దార్ వద్ద వాపోయినట్లు సమాచారం.

వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి సస్పెన్షన్

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న దర్శినమల వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు శనివారం తెలిపారు. రైతు నుంచి మూడు లక్షలు డిమాండ్ చేయడంతో పాటు గతంలో కూడా ఆయా గ్రామాలకు సంబంధించిన రికార్డుల తారుమారు చేయడం, అధికవర్షాల సమయంలో ఆర్డీఓ ఆదేశాలను బేఖాతార్ చేయడం వంటి అంశాలు వాస్తవమని తేలడంతో గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.


అంతా ఇష్టానుసారం..!

గిరిధర్‌రెడ్డి ఏడేళ్ల కిందట మండలంలోని దర్శినమల గ్రామానికి వీఆర్‌ఓగా వచ్చారు. అయితే ఆయన కొన్నాళ్లు దర్శినమల పంచాయతీతో పాటు ధర్మవరం వీఆర్‌ఓగా కూడా కొనసాగారు. ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచి కుణుతూరు, పోతుకుంట, చిగిచెర్ల పంచాయతీలకు వీఆర్‌ఓగా కొనసాగారు. దీంతో ఇష్టానుసారంగా మ్యూటేషన్ అప్రూవల్స్ చేయించడం, రైతుల నుంచి లంచాలు పుచ్చుకుని పనులు చేసినట్లు పలువురు బాధితులు విమర్శిస్తున్నారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలోకి పనులు కోసం వెళ్లే రైతులను అధికారులు లంచాలు అడుగుతుండటంతో హడలెత్తిపోతున్నారు. భూమి రికార్డుల నుంచి పాస్‌పుస్తకాలు కోసం, విద్యార్థుల సర్టిఫికెట్ల అప్రూవల్ ఇలా ఏ పనికోసం వెళ్లినా చేయి తడపాల్సిందేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మధ్య వర్తులను ఏర్పాటు చేసుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయమ్...

భోగరాజు పట్టాభి సీతారామయ్య (జయంతి)



ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య 1880 నవంబరు 24న పశ్చిమ గోదావరి జిల్లా గుండుగొలను గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, స్వాతంత్ర్యానంతరం పార్లమెంటు సభ్యుడిగా, మధ్యప్రదేశ్ రాష్ట్ర తొలి గవర్నర్‌గా వ్యవహరించారు. తాను స్థాపించిన ఆర్థిక సంస్థలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని సూచించారు. విలియం టారెన్స్ రాసిన ఎంపైర్ అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగుభాషకు, తెలుగుజాతికి చిరస్మరణీయ సేవలందించిన ఆయన 1959 డిసెంబరు 17న తుదిశ్వాస వీడారు. ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

వంగర వెంకటసుబ్బయ్య (జయంతి)



వంగర వెంకటసుబ్బయ్య 1897 నవంబరు 24న తెనాలి ప్రాంతంలో జన్మించారు. తెలుగు నాటక, సినీ రంగాలలో 'వంగర'గా పేరొందిన హాస్యనటుడు. 4వ యేటనే 'చిత్ర నళినీయం' నాటకంలో వేషం వేశారు. 'శ్రీకృష్ణ తులాభారం' నాటకంలో వసంతకుడిగా, 'విప్రనారాయణ' సినిమాలో శిష్యుడిగా కళాహృదయుల మన్ననలు అందుకున్నారు. కన్యాశుల్కం, చక్రపాణి, పల్నాటియుద్ధం, తెనాలి రామకృష్ణ, గీతాంజలి తదితర వందకుపైగా తెలుగు చిత్రాలలో నటించారు. 1975లో కన్నుమూశారు.

అంబరీశ్ (వర్ధంతి)



శాండల్‌వుడ్‌లో 'రెబెల్ స్టార్'గా పేరొందిన అంబరీశ్ 1952 మే 29న మండ్య జిల్లా దొడ్డ అరసిన కెరెలో జన్మించారు. అసలు పేరు మళవళ్ళి హుచ్చేగౌడ అమరనాథ్. 'నాగరహావు' సినిమాతో తెరంగేట్రం చేశారు. కన్నడ, తమిళ, మళయాళ, తెలుగు, హిందీ చిత్రాలలో నటించారు. రాజకీయాల్లోనూ రాణించారు. విష్ణువర్ధన్ పురస్కారం, ఎన్టీఆర్ పురస్కారం తదితర అవార్డులు పొందారు. 'మండ్యద గండు' 'అంబి'గా పిలవబడే ఆయన 2018 నవంబరు 24న కన్నుమూశారు.

చూశారా మేడం..!

ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించే అనంతపురం సర్వజన వైద్యశాలలో అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎప్పుడోగానీ అటువైపు చూడరు. రోడ్డు ప్రమాదం నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు మంత్రి సవిత ఆస్పత్రికి వచ్చారు. కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆమె వెంట ఉన్నారు. డయాలసిస్ సెంటర్ ముందు భాగంలో డ్రైనేజీ నీటిలో వారు నడిచి వెళ్లాల్సి వచ్చింది. ఆస్పత్రిలో అపరిశుభ్రతను మంత్రి కళ్లారా చూశారు. అప్పుడప్పుడు ప్రభుత్వ పెద్దలు వచ్చి వెళుతుంటే.. పరిస్థితులు కాస్తయినా మెరుగుపడతాయి. లేదంటే.. ఇదిగో.. ఇలాంటి అనుభవాలు ఎదురవుతాయి. **- అనంతపురం టౌన్**



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న మంత్రి సవిత

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు



చింతామణిలో కార్యకర్తల బైక్ ర్యాలీ



బంగారపేట విజయోత్సవంలో ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రతిష్ఠగా మారిన మూడు శాసనసభ నియోజకవర్గాల ఫలితాల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేయడంపై కార్యకర్తల సంబరాలు మిన్నంటాయి. పట్టణంలోని కువెంపు సర్కిల్‌లో బ్లాక్ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విజయోత్సవంలో ఎమ్మెల్యే నారాయణస్వామి మాట్లాడుతూ ప్రచారంవేళ బీజేపీ, జేడీఎస్ నాయకులు చేసిన విమర్శలు ప్రజలు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ప్రజలు ఆదరించారన్నారు. చన్నపట్టణలో విజయం ద్వారా మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామికి ముఖభంగమైందన్నారు. ఇక్కడ సీపీ యోగేశ్వర్ సత్తా చాటి విజయం సాధించారన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల నాయకత్వం మరింత బలపడిందన్నారు. ఈ ఫలితాలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు దిక్సూచి కానున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్యారెంటీ పథకాల సమితి అధ్యక్షుడు పార్థసారథి, పురసభ అధ్యక్షుడు గోవింద, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రకుమార్, పురసభ సభ్యుడు షంషుద్దీన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో..

చింతామణి: శాసనసభ ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయంపై చింతామణి తాలూకాలో కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డు తాలూకా పంచాయతీ దుకాణ సముదాయం నుంచి కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత కాంగ్రెస్ జెండాలతో నినాదాలు చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బైక్‌ర్యాలీ పట్టణమంతా వివిధ కూడళ్ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, సాదిక్, నగర యోజనా ప్రాధికార అధ్యక్షుడు శ్రీనాథ్, నగరసభ అధ్యక్షుడు జగన్నాథ్, జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు స్కూల్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవహార జ్ఞానం ప్రోత్సహించేలా సంత

బంగారపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని లక్ష్మీపుర గ్రామంలో స్వామి వివేకానంద పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన చిన్నారుల సంత ఉత్సాహంగా సాగింది. వివిధ వేషధారణలతో చిన్నారులు ఆకర్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బాలికలు కళశాలతో తలపై పెట్టుకుని డప్పులు వాయిస్తూ నృత్యం చేయడం ఆకర్షణీయంగా నిలిచింది. సుమారు రెండు గంటలపాటు వ్యాపారాలు చేసిన చిన్నారులు లాభం గడించి సంతోషంగా గడిపారు. పిల్లలను కేవలం ఆట పాటలకే పరిమితం చేయకుండా దైనందిన జీవనంలో ఎలా వ్యవహారాలు చేయాలనే అంశాన్ని స్పష్టంగా అవగాహన కల్పించేలా సంత నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. జ్యోతి పబ్లిక్ స్కూల్, స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. జ్యోతి పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థ అధ్యక్షుడు సతీశ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల్లో వ్యవహార జ్ఞానాన్ని పెంపొందించేందుకు వారిచే సంతలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించామన్నారు. పలు రకాల తినుబండారాలను విక్రయించారు. బసవశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జిశాన్ అలి, బసవశ్రీ ట్రస్టు సభ్యుడు షరీఫ్‌సాబ్, కార్యదర్శి గణేశ్, ఉపాధ్యాయులు రేణుకా, కవిత, శశికళ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల సంతలో సంబరం

యాంటి బయాటిక్స్ మోతాదుకు మించి వాడరాదు

▸▸ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాంటి బయాటిక్ మందులు మోతాదుకు మించి వాడరాదని, నియంత్రణకు ప్రత్యేక పాలసీ అవసరమని ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. జాతీయస్థాయి ఫీవర్‌కాన్ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపాటి జబ్బులకు అత్యధిక డోసు యాంటి బయాటిక్ వాడుతున్నారన్నారు. తద్వారా రోగనిరోధకశక్తి తగ్గిపోతుందన్నారు. ఆరోగ్య సమస్యలలో ప్రథమ లక్షణం జ్వరం అని దీన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్‌లు రోగుల సమస్యలను తెలుసుకుని తగిన చికిత్సలు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సూపర్‌స్పెషాలిటీ చికిత్సా పద్ధతులు పెరిగిపోతున్నాయన్నారు. వైద్యశాస్త్రంలో రోగ నిర్ణయంలో జ్వరం పర్యవేక్షణ అత్యంత కీలకమైన అంశమన్నారు. జబ్బులను త్వరితగతిన నయం చేయాలని యాంటిబయాటిక్‌లను ఎక్కువగా ఇస్తున్నారన్నారు. అతిగా వాడితే అమృతం కూడా విషమవుతుందన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహులు, ఫీవర్‌కాన్ సంచాలకులు డాక్టర్ మంజుళతోపాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి వైద్యులు పాల్గొన్నారు.

మాతృభాష మనుగడకు కృషి చేద్దాం

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కన్నడ మాతృభాష అని మనమందరం భాషపై అభిమానంతో ఇతరులకు నేర్పించి భాష మనుగడకు కృషి చేద్దామని వక్తలు అభిప్రాయపడ్డారు. కన్నడ సాహిత్య పరిషత్ విజయనగర శాసనసభ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి ఉమేశ్‌చంద్ర నేతృత్వంలో కన్నడ సాహిత్య సమ్మేళనం ఏర్పాటైంది. పరిషత్ పతాకాన్ని ఉమేశ్‌చంద్ర ఆవిష్కరించారు. సమ్మేళనం అధ్యక్షురాలు మధుర అశోక్‌ను అలంకరించిన వాహనంపై పూర్ణకుంభాలతో స్వాగతించారు. ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప సమ్మేళనాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో కన్నడ సాహిత్య సమ్మేళనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గోవిందరాజనగర ఎమ్మెల్యే ప్రియకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఇటువంటి సమ్మేళనాలు మరింత విరివిగా నిర్వహించాలని వీటికి తమ సహకారం ఉంటుందన్నారు. ఇదే సందర్భంగా గగనముకి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ రంగాలలో సాధకులు 35మందిని సత్కరించారు. కసాప అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌జోషి, కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ హానగల్, పరిషత్ గౌరవ కార్యదర్శి నే భ రామలింగశెట్టి తదితరులు పాల్గొన్నారు.



కన్నడ సాహిత్య సమ్మేళనంలో ఎమ్మెల్యే కృష్ణప్ప తదితరులు

కన్నడ కోసం ఎంతోమంది త్యాగాలు

▸▸ కసాప అధ్యక్షుడు మహేశ్‌జోషి

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషా సంస్కృతి, సరిహద్దుకోసం ఎంతోమంది పోరాటం చేశారని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌జోషి అభిప్రాయపడ్డారు. కన్నడ సాధకులకు దత్తి ప్రశస్తిలను శనివారం కసాపలో ప్రదానం చేశారు. ముఖ్యులుగా మాజీ న్యాయమూర్తి శ్రీధరరావు, ఇతిహాస శాసన నిపుణురాలు వసుంధర కవళి ఫిలియోజా, ఫ్రాన్స్ దేశ సంస్కృత వ్యాకరణ నిపుణులు సిల్వాన్ ఫిలియోజాలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గోమూర్తి యాదవ్, తుమకూరు రేవణ్ణ, డాక్టర్ మీరా సాబిహళ్ళి శివణ్ణ, గౌరిబిదనూరు బాలాజీ, కృష్ణమూర్తి కవత్తార్, విజయపుర డాక్టర్ కృష్ణ కొల్హార్, శైలజా పీఎస్, వనమాల విశ్వనాథ్‌తోపాటు పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు.



కన్నడ సాధకులకు సత్కారం

అధ్యక్షురాలిగా హేమావతి ఏకగ్రీవం

శిడ్లఘట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని పంచాయతీ అధ్యక్షురాలిగా చిక్కపాపనహళ్ళికి చెందిన హేమావతి రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీలో శనివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షస్థానానికి హేమావతి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తహసీల్దారు బిఎన్ స్వామి ప్రకటించారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా సేవలందించిన సునందమ్మ గడువు పూర్తి కావడంతో రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షురాలు హేమావతిని ఎమ్మెల్యే బిఎన్ రవికుమార్ అభినందించారు. గ్రామపంచాయతీ సభ్యులందరి అభిప్రాయాలను పరిగణించి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు చంద్రు, నాగరాజ్, రమేశ్‌రెడ్డి, నారాయణస్వామి, వీరణ్ణ, గాయత్రమ్మ, వెంకటరెడ్డి, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షురాలు, సభ్యులకు సన్మానం

ప్రజల సమస్యలు ఆలకించిన డీఎస్పీ

దొడ్డబళ్ళాపుర, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా పోలీస్, దొడ్డబళ్ళాపుర పోలీస్ ఉపవిభాగం ఆధ్వర్యంలో దొడ్డబళ్ళాపురలోని ఆర్‌డి కన్వెన్షన్ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశమై ప్రజల సమస్యలను ఆలకించారు. డీఎస్పీ రవి నేతృత్వంలో సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, దళితులు తదితరులు పాల్గొని సమస్యలు విన్నవించారు. తాలూకాలో గాంజాయి సమస్య అధికమైందని యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ మద్యం ఉన్నట్టు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ అమరేశ్‌గౌడ, హరివర్ధన్, కల్లప్ప ఎస్ కరాత్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవి


జడ్పీ ఉపకార్యదర్శి పరిశీలన

శిడ్లఘట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని వై హుణసేనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను చిక్కబళ్ళాపుర జిల్లా పంచాయతీ ఉపకార్యదర్శి అతీక్ పాషా పరిశీలించారు. వారహుణసేనహళ్ళిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీగోడ, వంటగది, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం దొడ్డదాసేనహళ్ళి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ, అన్నపూర్ణేశ్వరి వంట గదిలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. ఉపాధి కింద వ్యక్తిగతంగా పశువులపాక, బాత్రూం గుంత, వ్యవసాయ కుంట, గొర్రెలు, కోళ్లకోసం షెడ్‌లు వంటివాటిని నిర్మించుకునే అవకాశం ఉందని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చిక్కబళ్ళాపుర జిల్లా పంచాయతీ డిఎంఐఎస్ మధు, జిల్లా పంచాయతీ ఏడిపిసి హరీశ్, తాలూకా టెక్నికల్ ఇంజనీర్ నాగేంద్ర, ఇంజనీర్ బాబు, తాలూకా ఐఇసి సంయోజకులు లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



అతీక్‌పాషాతో అధికారుల బృందం

వర్గపోరు



పురం వైసీపీలో కొనసాగుతున్న విభేదాలు

- ఇన్‌చార్జిని మార్చాలంటూ మూడు వర్గాల పట్టు
- సహకరించనివారిని సస్పెండ్ చేయాలంటున్న ఇన్‌చార్జ్ వర్గం
- నేడు అభిప్రాయ సేకరణకు ముఖ్యనేతల రాక



హిందూపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భవం నుంచి కూడా నియోజకవర్గంలో వర్గపోరు సాగుతూనే ఉంటుంది. పార్టీ ఇన్‌చార్జ్ ఎవరైనా సరే వారికి మూడు వర్గాలు వ్యతిరేకంగా పని చేయడం ఇక్కడ సర్వసాధారణం. స్థానిక నాయకుడు ఇన్‌చార్జ్‌గా ఉన్నా, స్థానికేతరులు ఉన్నా వర్గపోరు మాత్రం ఆగడం లేదు. ప్రస్తుతం ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు అద్దం పడుతున్నాయి.

ఆది నుంచి పోరే..

వైసీపీ ఆవిర్భావం తర్వాత నియోజకవర్గ మొదటి సమన్వయకర్తగా చౌళూరు రామకృష్ణారెడ్డికి అవకాశం ఇచ్చారు. అయితే ఆయన్ను కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వ్యతిరేకించారు. వీరిద్దరిని వ్యతిరేకిస్తూ అప్పట్లో డా.మదన్‌మోహన్‌రెడ్డి మూడో వర్గంగా ఏర్పడ్డారు. 2014ఎన్నికలకు ముందు పై ముగ్గురిని కాదని నవీన్‌నిశ్చల్‌ను తీసుకుని టికెట్ ఇచ్చారు. అయితే అప్పుడు కూడా అతడికి మూడు వర్గాలు వ్యతిరేకంగా పనిచేశాయి. ఆయన 2019ఎన్నికల ముందు వరకు ఇన్‌చార్జ్‌గా ఉన్నాడు. అయితే అతన్ని కూడా పక్కనబెట్టి మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ఘనికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన వర్గపోరు పడలేక తాను ఎన్నికల్లో పోటీచేయనని అధిష్ఠానానికి చెప్పడంతో ఎన్నికలకు కొద్దిరోజుల ముందు మాజీ ఐపీఎస్ అధికారి షేక్ మహ్మద్ ఇక్బాల్‌ను హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన బీఫారం తీసుకుని నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన మొదటిరోజే కొడికొండ చెక్‌పోస్టువద్ద నవీన్‌నిశ్చల్‌కు ఇక్బాల్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త వర్గపోరుగా మారి కొనసాగింది. దీంతో ఎన్నికల్లో ఇక్బాల్ ఓటమిపాలయ్యాడు. అయినా పురం వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఆయనకు వ్యతిరేకంగా నవీన్‌నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వ్యతిరేకంగా పనిచేస్తూ వచ్చారు. కానీ చౌళూరు రామకృష్ణారెడ్డి ఎమ్మెల్సీతో కలిసి ఉన్నాడు. కొద్దిరోజుల తరువాత ఆయనతో విబేధించాడు. ఈ పరిస్థితుల్లో 2022 అక్టోబరులో చౌళూరు రామకృష్ణారెడ్డి దారుణహత్యకు గురయ్యాడు. దీనిని ఆసరాగా చేసుకుని అప్పట్లో నవీన్‌నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చౌళూరు రామకృష్ణారెడ్డి వర్గీయులు ఇక్బాల్‌ను వ్యతిరేకించారు. అయినా కొంత కాలం ఆయన్నే ఇన్‌చార్జ్‌గా కొనసాగించారు. 2023ఆగస్టు మాసంలో ఇక్బాల్‌నుకూడా తప్పించి బెంగళూరులో నివాసమున్న వేణురెడ్డి సతీమణి దీపికకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. మొదట అందరూ కలిసి ఉన్నట్లే కనిపించినా ఆ తరువాత ఎవరికి వారుగా నాలుగు వర్గాలుగా విడిపోయారు. 2024లో జరిగిన ఎన్నికల్లో దీపిక బరిలో దిగారు. అయితే ఆమె ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే మూడు వర్గాలు తన గెలుపుకోసం పనిచేయలేదంటూ దీపిక వర్గీయులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆమె పురం వైసీపీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. అయితే ఆమెను తప్పించి వేరేవారికి ఇన్‌చార్జ్ పదవిని ఇవ్వాలని మిగిలిన నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో దీపికను మార్చాలంటూ మూడు వర్గాల నాయకులు గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. స్థానిక నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకుడికి బాధ్యతలు అప్పగించాలని ఒకరిద్దరు ముఖ్య నేతలు అధిష్ఠానానికి విన్నవించినట్లు సమాచారం.

ముఖ్య నేతను సస్పెండ్ చేయాలంటున్న ఇన్‌చార్జ్ వర్గం

ఇదిలా ఉండగా పార్టీలో ఓ ముఖ్యనేత మాకు మొదటి నుంచి సహకరించలేదంటూ ఎన్నికల సమయంలో కూడా పార్టీ గెలుపునకు ఏమాత్రం పనిచేయలేదంటూ ఇన్‌చార్జ్ వర్గీయులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి వద్ద ఎన్నికల అనంతరం వాపోయినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఇటీవల పార్టీ ముఖ్యనేతలతో కలిసి విన్నవించినట్లు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యనేతను బహిష్కరించడం సబబు కాదని పార్టీలోని ఓ నాయకుడు చెప్పినట్లు తెలిసింది. అయినా ఇన్‌చార్జ్ వర్గం అధిష్ఠానం వద్ద కొన్ని డిమాండ్లు పెట్టింది. ఇదే సమయంలో ఇన్‌చార్జ్‌ను తప్పించి నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేవారిని నియమించాలని కోరుతున్నారు. అయితే ఎవరు ఇన్‌చార్జ్‌గా ఉన్నా ఖర్చు వారే భరించుకోవాలని, అలాంటి వారికే ఇన్‌చార్జ్ పదవి అప్పగిస్తామని ఓ నాయకుడికి అధిష్ఠానం సూచించినట్లు సమాచారం.



నేడు అభిప్రాయ సేకరణకు ముఖ్యనేతల రాక

హిందూపురం నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు ఇటీవల పార్టీ అధినేతను కలిసి ఇన్‌చార్జ్ పదవి గురించి ప్రస్తావించినప్పుడు సున్నితంగా మీరు వెళ్లి వ్యాపారాలు చేసుకోండి ఇంకొకరికి అవకాశం ఇస్తామని చెప్పినట్లు సమాచారం. కానీ మరో వర్గం వారు మాత్రం 'అధిష్ఠానం మనవైపే ఉంది. మనల్ని వ్యతిరేకించి పార్టీకి నష్టం కలిగించే వారిని బయటకు పంపడానికి సిద్ధంగా ఉన్నాం' అని సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఆదివారం జిల్లా అధ్యక్షురాలితోపాటు మరో ఇద్దరు ముఖ్యనేతలు ఇన్‌చార్జ్ పదవిపై ఇక్కడ నెలకొన్న విభేదాల పరిష్కారంలో భాగంగా అభిప్రాయ సేకరణకు హిందూపురం వస్తున్నట్లు తెలిసింది. ఇన్‌చార్జ్‌గా ఉన్న దీపిక కార్యాలయంలో సమావేశం ఉంటుందని వారి వర్గీయులు తెలుపగా అందుకు రెండు వర్గాలు వ్యతిరేకించినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఎక్కడైనా వేరేచోట సమావేశం పెట్టాలని నిర్ణయించారు. ఏది ఏమైనా హిందూపురం నియోజకవర్గం వైసీపీలో మాత్రం వర్గ పోరు చల్లారడం లేదు.

వేడుకల విజయవంతంపై ఎస్పీ హర్షం



పుట్టపర్తిరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించిన పోలీసు యంత్రాంగం, వివిధశాఖలు, మీడియా ప్రతినిధులకు జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలియచేశారు. జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖుల పర్యటనలో ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా విజయవంతం చేసిన పోలీసుశాఖకు ప్రత్యేక అభినందనలన్నారు. ప్రశాంతినిలయంలోని పలు కీలకప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. బందోబస్తులో లోటుపాట్లను ఎప్పటికప్పుడు తమదృష్టికి తెచ్చి సత్యసాయి జయంత్యుత్సవాలు విజయవంతం చేయడంలో మీడియాపాత్ర అమోఘమని ప్రత్యేకంగా అభినందించారు.

మాకు దిక్కెవరు..?

అనంతపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రికి వచ్చిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు విలపించారు. ఇక తమకు దిక్కెవరని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ దాదాపు అరగంటపాటు ఆందోళన చేశారు. ఎంపీ, కలెక్టర్ వారిని ఓదార్చారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు.



నిరసనలో గ్రామస్థులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.51	1597.62
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,066	681
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,246	9,751
నీటి నిల్వ (టీఎంసీలు)	96.00	18.61

26 నుంచి ప్రవచనాలు

బళ్లారి సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో 26, 27, 28 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఆర్యవైశ్య అసోషియేషన్ ఆధ్వరంలో శ్రీ రామకృష్ణ వివేకానంద కేంద్రంలో ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య అసోషియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వర రావు హాజరై ప్రవచిస్తారని తెలిపారు. అనూఫ్ గార్డెన్ హావం బావిలో జరుగుతున్నట్లు తెలిపారు.

గెలిచినా సంతోషం ఓడినా బాధ... లేదు

● కాంగ్రెస్‌కు మెజార్టీ తగ్గడంతో అయోమయం..

బళ్లారి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కంచుకోట అయిన సండూరులో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఓటమి పాలయిన బీజేపీ శ్రేణుల్లో పెద్దగా బాధ లేదని చెప్పవచ్చు. అటు విజయం సాధించినా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం అంతగా లేదని చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం మెజార్టీ భారీగా పడిపోవడమే. ఈదే చర్చ రెండు పార్టీలోనూ కొనసాగుతోంది. 2023లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఇ. తుకారాం ఏకంగా 35,522 ఓట్లతో విజయం సాధించారు. భారీ మెజార్టీపై జోరుగా చర్చలు జరిగాయి. అయితే సండూరులో కాంగ్రెస్ విజయం సాధారణమే అని అంతా తేలిగ్గా తీసుకున్నారు. కానీ ఉప ఎన్నికల్లో మెజార్టీ పడిపోవడం కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం కలిగిస్తోంది. ఎన్నికల ప్రచారంలో సీఎం సిద్దరామయ్య, పలువురు మంత్రులు ఇక్కడే మకాం వేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కంటే ఎక్కువ మెజార్టీ వస్తుందని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అయితే మెజార్టీ తగ్గడంపై కాస్త నిరాశే మిగిలింది.



సీనియర్ల సహకరించారా..?

కాంగ్రెస్ పార్టీ తుకారాం ఇంటికే మరీ టికెట్ ఇవ్వడంపై పార్టీలో కొందరు సీనియర్లు తిరుగుబాటు చేశారు. బంగారు లక్ష్మణ తొలుత సహకరించకపోవడంతో అధిష్టానం ప్రత్యేకంగా పిలిపించి బుజ్జగించింది. ఎంపీ, ఎమ్మెల్యే రెండూ వారికేనా అన్న ఆగ్రహం కొందరు వ్యక్తం చేశారు. అసంతృప్తులను నచ్చజెప్పడానికి మంత్రి సంతోష్ లాడ్ నానా తంటాలు పడ్డారు. ఇక బీజేపీలో కూడా కొత్త అభ్యర్థిని రంగంలోకి దించారు. బంగారు హనుమంత విజయం కోసం గాలి జనార్దన్‌రెడ్డి తీవ్రంగా కృషి చేశారు. విజయం సాధించలేకపోయినా మెజార్టీ తగ్గించాం అన్న సంతృప్తి బీజేపీ శ్రేణుల్లో ఉందని చెప్పవచ్చు. బీజేపీ కంచుకోటలుగా భావించే శిగ్గావి, చన్నపట్టణ లాంటి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అఖండ మోజార్టీతో గెలవడం, కాంగ్రెస్ కంచుకోట భావించే సండూరు నియోజకవర్గం తక్కువ మెజార్టీతో కాంగ్రెస్ గెలవడం చూస్తుంటే రాజకీయ పరిణామాలు అంచనా వేయలేమని తెలుస్తోంది. ప్రజల నాడి తెలుసుకోవడం కష్టంగా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం పడుతున్నారు.

ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్‌దే ఆధిక్యం..



ఓట్ల లెక్కింపులో అధికారులు

బళ్లారి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల ఫలితాల్లో తొలి నుంచి కాంగ్రెస్ హవా కొనసాగింది. ఓట్ల లెక్కింపు మొత్తం 18 రౌండ్లలో చేపట్టారు. తొలి రౌండులో కాంగ్రెస్ అభ్యర్థికి 2,586 ఓట్లు మెజార్టీతో బోణీ కొట్టగా అదే జోరు చివరి రౌండ్ వరకు కొనసాగింది. లెక్కింపు ముగిసే సరికి కాంగ్రెస్ కు 9,649 ఓట్ల మెజార్టీ వచ్చినట్లు ప్రకటించారు. ఫలితాలు వెలువడగానే కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. ఇద్దరు అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొనగా ఇతర అభ్యర్థులకు అరకొర ఓట్లు పడ్డాయి. కర్ణాటక జనతాపార్టీ అభ్యర్థి అంజినప్ప.ఎన్ కు 632 ఓట్లు, ఇండిపెండెట్లు టీ.ఎం మారుతికి 211 ఓట్లు, వై. ఎర్రిస్వామికి 278 ఓట్లు, ఎన్. వెంకన్నకు 461 ఓట్లు, పోల్ అయ్యాయి. నోటాకు 1040 ఓట్లు పడ్డాయి.

గట్టి పోటీ ఇచ్చిన బీజేపీ..

అంతా ఊహించినట్లే కాంగ్రెస్ విజయం సాధించింది. బీజేపీ 2 వేల నుంచి 5 వేల ఓట్ల మోజార్టీ సాధించే అవకాశం ఉందని భావించారు. కాంగ్రెస్ అనుకున్నట్లు జరిగిందని సంబరాలు జరుపుకున్నారు. కాకపోతే కాంగ్రెస్ కంచకోటగా పేరు ఉన్న సండూరులో మెజార్టీ బాగా తగ్గిపోవడంతో కాంగ్రెస్ వర్గాలు కాస్త నిరాశకు గురయ్యాయని చెప్పవచ్చు. బీజేపీ మాత్రం నైతిక విజయం తమదేనని అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో తొలి నుంచి కాంగ్రెస్ హవా కొనసాగుతోంది. స్వాతంత్యం వచ్చిన నాటి నుంచి 16 సార్లు ఎన్నికలు జరగగా రెండు సార్లు మినహా అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. మరో సారి కాంగ్రెస్ విజయంతో చెక్కుచెదరని స్థానంగా రుజువయ్యింది.

ఓటమికి నాదే బాధ్యత : హనుమంత



ఉప ఎన్నికల్లో ఓటమికి బాధ్యత తనదేనని బీజేపీ అభ్యర్థి బంగారు హనుంత పేర్కొన్నారు. ఫలితాల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విచ్చలవిడిగా ధనం ఖర్చు చేసిందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పుర్తీగా శ్రమించారన్నారు. యడియూరప్ప, ప్రహ్లాద్ జోషి, విజయేంద్ర, గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు, దివాకర్, సోమశేఖర్‌రెడ్డి తన విజయానికి విశేషంగా కృషి చేశారన్నారు. రానున్న రోజుల్లో పార్టీ ఏ బాధ్యత అప్పగించినా పని చేస్తానన్నారు. 2029 ఎన్నికల్లో పార్టీ టికెట్ ఎవరికిచ్చినా వారి విజయానికి కృషి చేస్తానన్నారు. తనకు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

బాధ్యత పెంచింది: అన్నపూర్ణ



మాట్లాడుతున్న అన్నపూర్ణ, ఎంపీ తుకారాం

ఉప ఎన్నికల్లో గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని, నియోజకవర్గ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నపూర్ణ పేర్కొన్నారు. ఫలితాల అనంతరం భర్త తుకారాంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తనకు ఓటేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యావాదాలు తెలిపారు. ఎంపీ తుకారాం మాట్లాడుతూ గ్యారెంటీ పథకాలే తమ విజయానికి కారణమయ్యాయన్నారు. సంతోష్‌లాడ్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. సండూరులో ఐదు సార్లు గెలిచి, ప్రజల విశ్వాసం నిలుపుకున్నామని హర్షం వ్యక్తం చేశారు.

నైతిక విజయం బీజేపీదే : గాలి



సండూరులో పార్టీ ఓడినా నైతిక విజయం బీజేపీదేనని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఫలితాల అనంతరం విలేకరులతో మాటాడిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి కేవలం 9,649 ఓట్లు తో గెలిచారని, ఇది పెద్ద మోజార్టీ కాదన్నారు. సీఎం సిద్దరామయ్య, కాంగ్రెస్ కేబినెట్ అంతా వచ్చి ఉప ఎన్నికల్లో పనిచేశారని, వేల కోట్లు వెచ్చించారన్నారు. అయినా పెద్ద మెజార్టీ సాధించలేక పోయారన్నారు. కంచుకోటగా చెప్పుకునే కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చామన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. త పార్టీకి చావు తప్పి కన్ను లొట్ట పోయినంత పని అయ్యిందన్నారు.

పుస్తక పఠనంతో మనిషికి జ్ఞానం

సిరుగుప్ప, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు, పత్రికలు చదవడం వలన మనిషికి జ్ఞానం లభిస్తుందని న్యాయవాది వెంకటేష్ నాయక పేర్కొన్నారు. శనివారం సిరుగుప్ప పట్టణం ప్రధాన గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భావచిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలు చదవడం అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధికారి రవికుమార్, సమాజసేవకుడు అబ్దుల్ నబీ, ప్రజలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కంప్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో స్త్రీశక్తి మహిళా సంఘాలు ధర్మస్థళ గ్రామీణ అభివృద్ధి పథకం ద్వారా అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ జీ చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్ సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్లి తాలుకాలో 2,673 సంఘాలు వున్నాయన్నారు. ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా ఎందరో ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. మహిళలు స్వశక్తితో టైలరింగ్ షాపులు ఏర్పాటు చేసుకుని కుటుంబానికి అండగా వుంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అనంతరం తాలుకా అధికారి హాలప్ప మాట్లాడుతూ ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ రూ. 1.97 కోట్ల లాభాల్లో ఉందన్నారు. లాభంతోనే సభ్యులకు కృషి వ్యవసాయ తోటలు పెంచే వారికి లాభాలను పంచుతున్నట్లు తెలిపారు. రోహిత్ సజ్జ, సంజీవ్‌కుమార్, హేమయ్యస్వామి, మంజుళ, ఆశాకుమారి, లత, ఉలిగమ్మ, రమేష్ అమల, లక్ష్మీ, రూప తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న అధికారులు

కల్తీకల్లు స్వాధీనం

రాయచూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కల్తీ కల్లు విక్రయిస్తున్న ముగ్గురికి పోలీసులు అరెస్ట్ చేశారు. కల్తీకల్లు అమ్మకాలపై పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం నగరంలోని సియాతలాబ్‌లో దాడులు జరిపారు. 70 లీటర్ల కల్తీకల్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గత కొంత కాలంగా ఈ కాలనీలో పెద్ద ఎత్తున కల్తీకల్లు విక్రయం సాగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో లక్ష్మణ అనే వ్యక్తి ఇంటి పై దాడి చేశారు. దాడుల్లో కల్తీ కల్లు తయారీకి ఉపయోగించే సీహెచ్ పౌడర్, పేస్ట్ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. లక్షణతో పాటు హులిగెమ్మ, జమలమ్మ అనే ఇద్దరు మహిళల పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

ఉపాధి పనులు సమర్థవంతంగా నిర్వహించాలి

రాయచూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ అధికారి వేణుగోపాల్ అధికారులకు సూచించారు. జిల్లాలో చేపట్టిన ఉపాధిహామీ పనుల పురోగతి పై శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని దినాల కల్పన చేపట్టిన పనుల వివరాలు ఇప్పటివరకు ఎంతవరకు పూర్తి చేసింది. అనంతరం భవిష్యత్తులో చేపట్టే ప్రణాళిక ఇతర వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఆవిరిబూడిది నిర్వహణ ప్లాంట్ సీఎస్‌ఫీ క్లస్టర్ సౌకర్యాలు, అమృత్ సరోవర్ 2.0 పనుల పురోగతి కోసం గుర్తించిన ప్రాంతాలు తదితర విషయాల పై సమీక్ష నిర్వహించారు. అనంతరం రాయచూరు తాలూకాలోని చంద్రబండా గ్రామంలోని ఆశ్రయ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి కట్లాట్కూర్ గ్రామ సమీపంలో వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సంజీవిని షెడ్ నిర్మాణ పనులను అధికారి పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



సమీక్షలో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ అధికారి వేణుగోపాల్

ప్రశాంతంగా వార్డు పోలింగ్

రాయచూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 31వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ వార్డు నుంచి నగరసభ సభ్యురాలిగా గెలుపొందిన రేణుకమ్మ భీమరాయ తప్పుడు కుల ధ్రువీకరణ సమర్పించిందన్న నేపథ్యంలో ఆమె ఎన్నికను అధికారులు రద్దు చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన పోలింగ్ శనివారం ఉదయం మందకోడిగా ప్రారంభమూ సాయంత్రం వరకు దాదాపు 65 శాతం వరకు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ స్థానంలో కాంగ్రెస్ బీజేపీ అభ్యర్థులు పోటీ పడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థిగా అంజినమ్మ శ్యాంసుందర్, బీజేపీ అభ్యర్థిగా గిరిజా రవిరాజేంద్రలు పోటీ పడ్డారు. కాగా నగరసభ పాలన గడువు మరో 15 నెలలు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో నిర్వహించిన ఉప ఎన్నికను రెండు ప్రధాన పార్టీలు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించినా ఓటర్లు మాత్రం పెద్ద ఆసక్తి చూపకపోవడం గమనార్హం. పోలింగ్ తక్కువ శాతం నమోదు కావడంతో నాయకులు నిరాశ చెందారు.



క్యూలో నిల్చున్న ఓటర్లు

ఖాద్రీశా.. పాహిమాం..!

● భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కదిరి, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శనివారం సందర్భంగా పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తుల రాకతో దేవాలయ పరిసరాలు సందడిగా మారాయి.

కార్యకర్తల సంబరాలు



అన్నపూర్ణను అభినందిస్తున్న అల్లం వీరభద్రప్ప, అల్లం ప్రశాంత్

బళ్లారిరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ గెలుపుతో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కేపీసీసీ మాజీ అధ్యక్షులు అల్లం వీరభద్రప్ప, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం ప్రశాంత్ అన్నపూర్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు న్యాయం చేస్తాం

కంప్లి : కుడితిని పట్టణంలో గత 707 రోజులుగా ఫ్యాక్టరీల కోసం భూములు పోగొట్టుకున్న వేణి వీరాపురం, తదితర గ్రామాల రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే అన్నపూర్ణ హామీ ఇచ్చారు. బళ్లారి నుంచి సండూరు వెళుతూ కుడితినిలో రైతులు చేస్తున్న నిరసన వద్దకు వచ్చి ఆమె సంఘీభావం తెలిపారు. శీతాకాల సమావేశాల్లో సీఎంతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. జంగ్లిసాబ్, శ్రీధర్, అంజినప్ప, హనుమక్క, ఉలిగమ్మ, రాజశేఖర్, అంజి, దొడ్డప్ప, గంగాధర్, పంపన్న, విటోబ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డ ఆంజనేయస్వామికి 101 టెంకాయలు..

కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ గెలుపొందడంతో కుడితిని పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జెట్టి అంజి దొడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాము, మోటా తిమ్మ, గంగాధర, జాకీర్, రమేష్, మంజునాథ, మహాలింగ, శివానంద పాల్గొన్నారు.



దొడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు

కళాశాలలో ఉత్సాహంగా ఆహార మేళా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు గురుబసవరాజ్

బళ్లారి సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీరశైవ విద్యావర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీమతి అల్లం సుమంగళమ్మ స్మారక మహిళా కళాశాలలో '2అస్వాద్-2ఏ 24' పేరుతో శనివారం ఆహార మేళాను నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని వీవీ సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజ్, కార్యదర్శి అరవింద పాటిల్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వంట చేయడం, వివిధ రకాల వంటకాలు తయారు చేయడం, విక్రయించడం వంటి వాటిపై పోటీ నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమం చేపట్టామన్నారు. మొత్తం 20 ఓపెన్ స్టాల్స్‌ను ప్రారంభించి తక్కువ ధరకు వివిధ రకాల స్నాక్స్ డ్రింక్స్ అందజేశారు. ఆహార మేళ లో న్యాయనిర్ణేతులుగా గాయత్రి, నాగరత్న పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో గవిసిద్దప్ప గదగ, గంగాధర, అనుపమా, మమతా, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన

హోసూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లోని ముల్లైనగర్ ప్రభుత్వ హైయ్యర్ సెకండరీ పాఠశాలల్లో ట్రాఫిక్ పోలీసులు తరఫున అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ తంగదురై ఏఎస్పీ అక్షయ్ అనిల్ వాక్రే ఆదేశాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిల్లోని పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ ఐ సత్య మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పాఠశాల విద్యార్థులు పాఠశాల ముందు ద్విచక్ర వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం, డ్రైవింగ్ చేసే విద్యార్థులు , వారీ తల్లి దండ్రులపై కూడ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రోడ్డుపై ద్విచక్రవాహనం నడపడం, ఎదురుగా వచ్చే వాహనాలకు అంతరాయం కలిగించడం నేరం,అంతేకాక పాదచారులు, మరియు ప్రమాదకరమైన వేగంతో ద్విచక్ర వాహనాన్ని నడపడం, అలాగే వాహనాల్లో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం మంచిదని, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారిపై నేటి నుంచి హోసూరు కార్పొరేషన్‌ల్లో రూ.1000 వసూలు చేయనున్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌పై అవగాహనా కార్యక్రమంల్లో అవగాహన కల్పించారు. ఫలితంగా వచ్చే దుష్పరిణామాలు వివరంగా విద్యార్థుల్లోకి తీసుకెళ్లండి భవిష్యత్తుతరాలు ఇలాంటి పొరపాట్లకు పాల్పడకుండా చూడాలని, తమిళనాడు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు, కార్యక్రమంల్లో హోసూరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, ఎసై దేవన్, మురుగేషన్, శశికుమార్, రామస్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

హోసూరు నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలలో 4శాతం బధిరులకు కేటాయించాలని, తమిళనాడులోని బధిర పాఠశాలలో సంబంధిత నిపుణులైన ఉపాధ్యాయులను నియమించాలని కృష్ణగిరి జిల్లా డెఫ్ అసోసియేషన్ వార్షికోత్సవంలో తీర్మానించారు. హోసూరు సమీపంలో మత్తిగిరి టైటాన్ టౌన్‌షిప్‌లోని కేటీపీ ఆడిటోరియంలో అసోసియేషన్ వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి సంఘం చైర్మెన్ సురేష్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంల్లో మదర్ ఇండియా ఫామ్ యజమాని, సీఈవో దురైరాజ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను తమిళనాడు డెఫ్ పీపుల్ ఫెడరేషన్ అధ్యక్షుడు రమేశ్ బాబు ప్రారంభించారు. కోశాధికారి తపన్‌శర్మ ప్రారంభించి చివరగా బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ సమావేశంలో సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వం సమకూర్చే వినికిడి పరికరాలు మంచి నాణ్యతతో, తుప్పు పట్టకుండా ఉండాలన్నారు. పిడుగులు, విద్యాఘాతం సంభవించే ప్రమాదం ఉన్నందున చెవుల్లో వినికిడి పరికరాలను ధరించే కాగ్నిజెంట్ పద్ధతిని నిషేధించాలన్నారు. దివ్యాంగులకు నెలవారీ స్టైఫండ్‌ను రూ.1500 నుంచి రూ.6వేలకు పెంచాలన్నారు. తమిళనాడు బధిర సమాఖ్య ప్రధాన కార్యదర్శి పలు తీర్మానాలను ప్రస్తావిస్తూ ఈమేరకు ప్రభుత్వానికి విన్నవించనున్నట్టు తెలిపారు. సమావేశంలో 38 జిల్లాల పాలనాధికారులతో సహ మొత్తం 520 మంది సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు సమాఖ్య సర్వసభ్య సమావేశంపై కసరత్తు



సమావేశంలో పాల్గొన్న రాష్ట్రేతర తెలుగు సమాఖ్య పదాధికారులు

హోసూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రేతర తెలుగు సమాఖ్య (ఆర్‌టీఎస్) జాతీయ సర్వసభ్య సమావేశం ఈనెల 30 నుంచి రెండు రోజులపాటు మహారాష్ట్ర రాష్ట్రం షిర్డీలో జరగనుంది. ఇందుకు సంబంధించి సన్నాహకసభను కామరాజ్ కాలనీలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. హోసూరు నుంచి పాల్గొనే అంశంపై సంఘం మండల చైర్మన్ కృష్ణప్ప అధ్యక్షత వహించారు. షిర్డీలో జరిగే సభకు హోసూరు ప్రాంతానికి చెందిన 50 మంది సభ్యులు పాల్గొనాలని నిర్ణయించారు. ఆర్‌టీఎస్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యుడు, తమిళనాడు రాష్ట్ర కో ఆర్డినేటర్ సీతారామయ్య మీడియాతో మాట్లాడుతూ తమిళనాడులో నిర్బంధ తమిళ విద్యా చట్టం 2006 ద్వారా తెలుగ, కన్నడ, మలయాళం మాట్లాడే తమిళేతర మైనారిటీలు తమ మాతృభాషల్లో చదవలేకపోతున్నారంటూ కొన్ని తెలుగు సంఘాలు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అంశాన్ని ప్రస్తావించారు. భాషా అల్పసంఖ్యాకులకు వారి మాతృభాషల్లో విద్యను అందించడం, మాతృబాషల్లో చదువుకునేలా డిమాండ్ చేయడం విద్యార్థుల హక్కు అని కూడా పేర్కొందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలనే డిమాండ్‌ను షిర్డీలో జరిగే సదస్సులో తీర్మానించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి: మాజీ మంత్రి

హోసూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవితంలో రాణించేందుకు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు తంబిదురై పిలుపునిచ్చారు. హోసూరు నగరంలోని సెయింట్ పీటర్స్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో 2024-25 సంవత్సరానికి 150 మంది అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ విద్యార్థులకు వైట్‌కోట్ అందజేత కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ జయశంకరన్, కంచి విశ్వవిద్యాలయం, మాజీ వైస్ చాన్సలర్ అండ్ డైరెక్టర్ జనరల్, సెయింట్ పీటర్స్ విశ్వవిద్యాలయం వైస్- ఛాన్సలర్, యూనివర్శిటీ వైష్ ఛాన్సలర్ డాక్టర్ మాల్మురుగన్, అదియమాన్ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ డైరెక్టర్ డాక్టర్ రంగనాథన్, మాజీ మంత్రి వీరమణి, లైవ్లీ హుడ్ ఎడ్యుకేషన్ ఛీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ డాక్టర్ కన్నన్ గ్రీస్‌లు ముఖ్యులుగా విచ్చేసి వైద్యం ప్రాధాన్యతపై ప్రసంగించి వైద్య విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. తంబిదురై ప్రధాన ప్రసంగం చేసి విద్యా క్రీడల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ బానుమతి తంబిదురై, డాక్టర్ ఇలసియా తంబిదురై, ఫౌండేషన్ సభ్యురాలు డాక్టర్ నమ్రత తంబిదురై, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజముత్తయ్య వైస్ ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, మెడికల్ సూపర్‌వైజర్ గిరీస్, ఒంగల్, రెసిడెంట్ డాక్టర్ పార్వతి పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మాజీ మంత్రి తంబిదురై